# నర-సింహం




పులిచెర్ల సాంబశివరావు

నరసింహం ఎంతసేపు బతిమిలాడినా సింహం వినడంలేదు. నాలుగు బాది వీపు బద్దలుగొట్టి చెప్పటమేకాని బతివూలి నచ్చచెప్పటం నరసింహానికి తెలియనే తెలియదు. కాని ఇప్పుడాపని లాభంలేదు. సింహం జబ్బునపడి మెతకిచ్చిపోయింది. అందువలన కోపాన్ని సాధ్యమైనంతవరకూ అడచిపెడుతున్నాడు నరసింహం. ఒతిమిలాడ్డం మొదలు పెట్టాడు.

'మా బుజ్జినికదూ! ఇంద...కొంచెం... కొంచమంటే కొంచెమే తిని ఎంగిలిపడుదూ' అంటూ గుప్పెడు మాంసం సింహం నోటి దగ్గర పెట్టాడు. ఎంత చెప్పినా ఆ సింహం తాబట్టిన కుందేటికి మూడేకాళ్లంటూంది. కనీసం వానినకూడా చూడకుండా తల అవతలకు తిప్పుకొంది. మధ్య మధ్య 'గుర్...'అని మాత్రం అంటూంది. అతని కన్నులమీద గుంపుగా వ్రాలిన తెల్లని కనుబొమ్మలు మధ్య మధ్య పైకిలేస్తూ కోపాన్ని సూచిస్తున్నాయి.

ఇంకొకప్పుడైతే ఆ సింహాన్ని చీల్చి చెండాడేవాడు. కాని ఇప్పటి పరిస్థితి వేరు.

'ఒరేఁగ్ రాజా! ఇప్పుడు గనక నువ్విది తినకపోతే నన్ను చంపుకు తిన్నంత ఒట్టే! ఆఁ!' అని సింహం కన్నుల్లోకి దీనంగా చూస్తూ తన ముడతలుబడిన మొఖాన్ని దాని మొఖాని కానించి జంజూరులను నిమరసాగాడు. అది పిల్లిలాగా మూలుగుతూ అక్కడనుండి లేచి నాలుగడులు వేసి, ఇంక నడవటానికి శక్తిలేక అక్కడే కూలిపోయింది.

నరసింహం గుండె నీరయింది. కన్నులు చెమర్చాయి. ఇనుప చువ్వలగేటును బిగించి నరసింహం ఇవతలకొచ్చాడు. లోపలనుండి సింహం చెయ్యని నేరానికి జైల్లోపడ్డ వానిలాగా చూస్తూంది. దాని కన్నులు నిప్పుకణికల్లా మెరుస్తున్నాయి— దుఃఖించడానికి కన్నీటి బిందువులుగూడా లభింపని అభాగ్యుని కన్నుల్లాగా!

నరసింహం బయటకొచ్చాడు. టయిం చూశాడు. సర్కస్ ప్రారంభం కావటానికి ఇంకా ఎక్కువ సమయం లేదు. బయటకు చూశాడు.

సర్కస్ చూడటానికి జనం ఎగబడ్డారు. లోపలగా ఇటువైపుగా—

జనం! బుకింగ్ దగ్గర!!

జనం ఆనందంగా నవ్వుతూ పేలుతూ—

జనం అటూ ఇటూ—

కోతుల్లాగా, ఎలుగు బంటుల్లాగా, ఒంటెల్లాగా, ఏనుగుల్లాగా, పులుల్లాగ, సింహాలలాగా—

ఎగబడ్డారు!

నరసింహం లోపల డేరాలవైపు చూశాడు. సర్కస్ మనుషులు సిద్ధమవుతున్నారు. నవ్వించేవాళ్లూ, పైన ఎగిరేవాళ్లూ, దూకేవాళ్లూ...

పులులూ సింహాలతో ఆడుకొని జనాన్ని ఆనందపెట్టే వాళ్లూ వాళ్ల పనుల్లో వాళ్లు!

నరసింహం మేనేజర్ దగ్గరకు వెళ్ళిపోయాడు.

లోపలకు చూశాడు. మేనేజరున్నాడు.

'సార్! రాజుకి ఒంట్లో ఏం నసిగా లేదు!' దేరాదగ్గరకుపోయి నరసింహం గొణిగాడు.

'హలో మిష్టర్ నరసింహం! రారా! ఇలాకూర్చో! ఆఁ! ఏమిటీ!' అంటూ మేనేజర్ ఆహ్వానించాడు.

నరసింహం రెండడుగులు ముందుకు వేశాడు. కూర్చోలేదు.

ఎక్కడో పల్లెటూళ్లో దిక్కూ దివాణమూ లేక బర్రెగొడ్లు గాచుకుంటూ బతికే తనను తెచ్చి ఇంతవానిని జేసిన ఆమేనేజరుగారంటే నరసింహానికి భయమూ భక్తీ ఉన్నాయి.

అందుకని వినయంగా నించొనే అన్నాడు.

'మన పెద్దసింహం రాజుగానికి యేం బాగువ లేదు; నీరసంగా ఉందిసార్'

'ఔను! మొన్న కలకత్తాలో మనం ప్రదర్శన పెట్టినపుడే హుషారుగా చెయ్య లేదు.'

'అప్పుడే కొంచెం జ్వరాలు వచ్చిందండీ! మళ్లీ వెంటనే ప్రయాణాలవల్ల బాగా దెబ్బతిన్నది. అసలే ముసలితనంగదా...' నెరసిన తన తలవెంట్రుకలను చేత్తో వెనక్కుదువ్వుకొంటూ నరసింహం సింహం స్థితి వివరించడానికి ప్రయత్నిస్తున్నాడు.

'ముసలితనమైతే మాత్రం పనిచెయ్యక తప్పుతుందటోయ్!'

'కానీ...అది యివ్వాళ మరీ యిదిగా ఉందండి. నాలుగడుగులైనా వెయ్య లేకుండా ఉంది!'

'ఈ ఊళ్లో ఇదే మొదటి ప్రదర్శన గదా! అందులో మనరాజు జేసే వింత వింత ఫీట్లనుగురించి ఎంతో గొప్పగా ప్రకటనలు చేస్తిమాయెను. ఇప్పుడది లేక పోతే మన సర్కస్ కంపెనీ పరువేమైనా ఉంటుందా!'

'క్షమించండి సార్! ఏమైనాసరే! ఇవాళ నేను రాజుచేత ఏమీ చేయించలేను.'

'నరసింహం!' పెద్దగా గర్జించాడు మేనేజరు. నరసింహం మేనేజరు మొఖం వైపు చూశాడు. మేనేజరు కన్నుల్లో సింహాలు కనపడ్డాయి గర్జిస్తూ. నర సింహం ఉలికిపడలేదు. పెద్ద పెద్ద సింహా లనే కుక్కల్లాగా జేసినవాడు నరసింహం మరి!

'మీరు నాకు చేసిన సాయానికి నేనెప్పుడూ కృతజ్ఞుణ్ణేసార్! నా జీవిత మంతా మీ సర్కస్ కంపెనీకే అంకితం చేశాను. ఆ సంగతి మీకు బాగా తెలును. ప్రపంచంలో మరే సర్కస్‌వాళ్ళూ చేయించ లేని విధంగా నేను సింహాలచేత ఎన్నో ఫీట్లు చేయించాను. సింహాలలో ఒక సింహంగా మెలిగాను. వాటిసంగతి నాకు బాగా తెలుసు. నా సంగతి మీకు బాగా తెలుసు...'

'మిష్టర్ నరసింహం! ఇదిగో ఇవి చూడు!' ఆరోజు వచ్చిన కొన్ని వార్తా పత్రికలను నరసింహం ముందు పెట్టాడు మేనేజరు. వాటినిండా ఆ సర్కస్ కంపెనీ ప్రకటనలు ఉన్నాయి. నరసింహం చూస్తు న్నాడు.

'ప్రపంచంలో మొట్టమొదటి సారిగా అద్భుత ప్రదర్శన. సింహంనోట్లో నర సింహం అనే ధైర్యశాలి తన తలను పెట్టడం!'

'మంచి తరుణము మించిపోవును! మరే సర్కస్‌లోనూ లేని వింతవింత ఫీట్లు. ప్రపంచ ప్రఖ్యాతమైన నరసింహం గారిచే సింహము లాడింపబడును.'

'మీరెప్పుడూ కనీవినీ యెరుగనట్టి ది! సింహంనోట్లో మనిషి తలదూర్చడం!'

నరసింహం ఒక్కొక్క పత్రికనే చూసి అవతల పెడుతున్నాడు.

'చూశావా నరసింహం! నీమీద మన సర్కస్ కంపెనీ పెట్టుకున్న ఆశలు చూశావా! నీ ఒక్కనికి బతుకుతెరువు చూపినందుకు నన్ను పొగుడుతున్నావు, బాగుంది. కానీ నీమీద ఆధారపడి బతు కున్న మన సర్కస్ కంపెనీలో పనిచేసే వందలమంది సర్కస్ కళాకారులంతా...'

'సార్! అలాగే కానివ్వండి! అలాగే కానివ్వండి!' నరసింహం విసురుగా వెళ్ళి పోయాడు.

మేనేజరు నరసింహం పోయినవైపే కన్నార్పకుండా కాసేపు చూచి పిస్టల్ అందుకున్నాడు.

సర్కస్ బెల్లు కొట్టారు.

సర్కస్ ప్రారంభమయింది.

నవ్వించేవాళ్లు వచ్చారు. జనం నవ్వారు.

ఆడవాళ్ళు వచ్చారు. పైకి ళ్ళు తొక్కుతూ. జనం ఆశగా చూశారు.

ఒక్కొక్కటే జరిగిపోతూ ఉంది.

నరసింహం డ్రెస్ చేసుకుంటున్నాడు. ఎకువచ్చనిరంగుతో కన్నులు మిరుమిట్లు గొల్పుతున్న కోటు తొడుక్కున్నాడు. మేనేజర్ ఆ కోటును నరసింహంకోసం రష్యానుండి తెచ్చాడు. అది తొడుక్కుంటు న్నప్పుడల్లా మేనేజరు కన్నుల్లో మెదుల్తాడు.

నరసింహం కొరడా అందుకొన్నాడు.

తనకు కాలం సమీపించింది.

సింహం దగ్గరకు పోయాడు. తలుపు తెరిచాడు. సింహం మూలుగుతూ పడి ఉంది. పసిపిల్ల నాలాగా చూస్తూంది.

అది మూడునెల పిల్లగా ఉన్నప్పటి నుండీ నరసింహం దగ్గరే పెరిగింది. సీసాలో పాలుపోసి పీక దానినోట్లో పెట్టి తానే దానికి తల్లి అయినట్లు పెంచాడు. ఎంత ప్రేమ ఉన్నా అప్పుడప్పుడూ కొరడా దెబ్బలు రుచి చూపిస్తూ తండ్రి ప్రేమ ఎలా ఉంటుందో గూడా దానికి తెలిసి వచ్చేటట్లుగా చేశాడు.

'ఇప్పుడు మీరెంతో ఆసక్తితో ఎప్పుడా ఎప్పుడా అని ఎదురు చూస్తున్న అద్భుత ప్రదర్శన. మిష్టర్ నరసింహం...ప్రపం చంలో మరే సర్కస్‌వాళ్లూ చెయ్యలేని అద్భుతం...మిష్టర్ నరసింహం...సింహాలకి సింహం...మిష్టర్ నరసింహం...' అనౌన్సరు చెపుతున్నాడు.

నరసింహం సింహాన్ని ఎత్తుకున్నాడు. మెడపైన వేసుకొని గోదా దగ్గర కొస్తు న్నాడు జనమంతా ఆనందంతో కరతాళ ధ్వనులు చేస్తున్నారు.

మేనేజరు ఆ ప్రక్కనే ఉంచున్నాడు. గుండ్రంగా ఒకదాని ప్రక్కన ఒకటి పెట్టి ఉన్న ఇనుప చువ్వలమధ్య నరసింహం ఉన్నాడు సింహంతో.

ఎప్పుడూ సింహంమీద ఎక్కి అక్కడకు వచ్చేవాడు నరసింహం. కానీ ఈసారి తానే సింహం పాత్రని ఎందుకు వహించాడో మేనేజరు ఒక్కడే ఊహించ గలిగాడు.

నరసింహం సింహాన్ని కిందపెట్టాడు.

సింహం విశ్వ ప్రయత్నం చేస్తూంది హుషారుగా ఉండటానికి.

## చిన్న మొత్తం పెట్టుబడితో

మీ విరామ కాలమునందు వ్యాపారం చేయండి.

ప్రింటెడ్ చీరలు, టెరిలిన్ మరియు టెరికాట్ బట్టలు విక్రయించి నెలకు వేలాది రూపాయలు సంపాదించండి! ఇండియాలో యెచ్చటనైనా మా ఏజన్సీ తీసుకోండి. అనుభవం అక్కర్లేదు. ఉచిత ప్రాస్పెక్టస్‌కు మరియు సాంపిల్ సెట్టుకు నేడే వ్రాయండి. జయం నిశ్చయం. మీ అడ్రసు యింగ్లీషులో లేక హిందీలో వ్రాయండి.

**VIJAYA AGENCIES**
603, Joshi Road, Karol Bagh,
New Delhi-5.

BEAUTEX


# నర-సింహం

మొదటిపేటు మంటలతో మండుతున్న రింగులోంచి సింహం అవతలకు దుమకటం. నరసింహం సింహానికి సంజ్ఞలు చేస్తున్నాడు. సింహం ఊరక చూస్తూ మూలుగుతూ ఉంది.

జనం చూస్తూ ఉన్నారు.

నరసింహం సంజ్ఞలు చేస్తూ ఉన్నాడు.

మేనేజర్ భయపడుతున్నాడు

జనం కన్నార్పటం లేదు.

సింహం లేవలేక పోతూ ఉంది.

జనం చప్పట్లు గొట్టారు...

విగతాళిగా!

ఈలలు వేశారు—

హేళనగా!

నవ్వుతున్నారు—

అవమానకరంగా!

నరసింహం సింహం కళ్ళల్లోకి చూశాడు. మేనేజరు మొఖంలోకి చూశాడు. జనాన్ని చూశాడు. జనం కళ్ళల్లో... మొఖాల్లో...

నరసింహం పిడికిలి బిగుసుకుంది. చేయి లేచింది.

'ఛెళ్ళు'—

మన్నది కొరడా!

జనమంతా ఉలిక్కిపడ్డారు—

పిడుగులు పడినంత పెద్దగా అరిచింది సింహం.

లేచి నుంచుంది.

కదల్లేక మళ్ళీ కూలబడింది.

జనం ఒకటేనవ్వు! 'ముసల్ది... ముసలోడు...' అరుపులు.

'ఛెళ్ళు...ఛెళ్ళు...ఛెళ్ళు...' నరసింహం బాదుతున్నాడు. సింహం మెలికలు తిరిగి పోతూంది. ఎగిరెగిరి పడుతూంది.

జనం ఆనందంగా చూస్తున్నారు.

ఉన్నట్టుండి సింహం రింగులోంచి అవతలకు దూకింది

జనం ఆనందంగా చప్పట్లుగొట్టారు.

నరసింహం కన్నీరు తుడుచుకొన్నాడు.

మేనేజర్ మూతిమీద చిరునవ్వు మెరిసింది.

'మిస్టర్ నరసింహం! ఇంద ఇది తీసికో ఎందుకైనా మంచిది...అది పగబట్టి ఉండొచ్చు!' మేనేజర్ పిస్టల్ అందించాడు. నరసింహం దాన్ని జేబులో వేసుకున్నాడు.

ఇప్పుడు అసలైనది...

సింహంనోట్లో నరసింహంతల పెట్టాలి!

నరసింహం సింహంవైపు చూశాడు. అది ఇటే చూస్తూంది పచ్చని కళ్ళల్తో.

నరసింహం చిటికేశాడు. సింహం నోరు తెరచింది. జనమంతా నోరు తెరచారు ఊపిరి బిగబట్టి!

నరసింహం సింహం నోట్లో తల పెట్టాడు...

జనమంతా కొన్ని క్షణాలలా నిర్విణ్ణులై తేరుకొని డేరా లెగిరేటట్టు హర్షధ్వానాలు చేశారు.

నరసింహం తల బయటకు తీశాడు. నరసింహం మొండెమూ తలా కలసే ఉండటం చూసి మేనేజరు అక్కడనుండి వెళ్ళిపోయాడు తృప్తిగా!

సింహం నేలకూలింది. విగశ్వాస ప్రారంభమయింది. అంతా నరసింహంవైపే చూస్తున్నారు సింహాన్ని ఎవరూ చూడటం లేదు. నరసింహం సింహాన్ని ఎత్తుకొని కరతాళధ్వనులమధ్య లోపలకు పోయాడు.

సర్కస్ అయిపోయింది. ఎటువాళ్ళు అటుపోయారు.

మర్నాడు...

నరసింహం కనబడలేదు.

పిస్టలూ...పిస్టలు కాల్పులవలన మరణించిన సింహమూ ఇనపచువ్వలమధ్య ఉన్నాయి.

నరసింహం ఇప్పుడు వాళ్ళ ఊళ్ళోనే బ్రదెగొడ్లు కాచుకొని బతుకుతున్నాడని వినికిడి. ●


## ఆనెలకు మందు

కాళ్ళలో ఆనెలు: వ్రేళ్ళపాతుకుని పాదాలు ఆనించి నడవలేక ఎన్నోమందులు వాడి నిరాశ చెందినవారు, బహిర్గ్రేపనతైలం వాడిన ఆనెలు శాశ్వతంగా మానును. వెల: బుడ్డి పోస్టుఖర్చులతో రు. 6—75. కోకోక్ కము చిత్రపటములతో రు. 3—50. దాంపత్య రహస్యములు రు. 5—50. వర్తక రహస్యములు సోపు, సిరా, పౌడరు, అగరువత్తులు, సాంబ్రాణి, వగైరా రు.5—50. తెలుగు—హిందీ స్వయం శిక్ష రు. 6—00. కుట్టుపని స్వబోధిని రు.5—50.

MEENA & Co.,
P. Box No. 297, Madras—1.

గోల్డెన్ పిల్స్

బంగారు మాత్ర



సిద్ధ, ఆయుర్వేదములో బ్రహ్మాండమైన తయారు. ఇవి గోల్పోయిన శక్తి, ధాతుబల హీనత, వింధు బలహీనత, నరముల బలహీనతను పోగొట్టి మీకు కుటుంబసుఖం, జీవిత సుఖం ఇవ్వేదానికి మాత్రకు ఏది సమం లేదు. చాలమంది నుండి బహుమతులు పొందియున్నది. మీరు నేడే వాడబ్బి. 100 మాత్రలు రు. 37—50. 50 మాత్రలు: రు. 20. పోస్టేజి రు. 3/— ముందుగా డబ్బు పంపవలెను. 50 మాత్రలకు తక్కువ పంపబడవు.

Karthikeya Vaidyasalai
Palani P. O.
Madurai Dt. (Tamil Nadu)